నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి



చాంద్రాయణగుట్ట: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయం (ఫలక్‌నుమాలోని బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం)లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఏర్పాట్లను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్వయంగా పరిశీలించారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్ కుమార్ పర్యవేక్షణలో కార్యాలయం చుట్టూ వంద మీటర్ల దూరం వరకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

శాలిబండ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఏర్పాటుకు గౌరవ సూచకంగా ఖాజా పహాడీ సబ్‌స్టేషన్ టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సమీపంలోని మీరాలం సబ్ డివిజన్ కార్యాలయంలో నవంబర్ 3న విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. మీరాలం, చందూలాల్ బారాదరి, అత్తాపూర్, కిషన్ బాగ్ సెక్షన్ల వినియోగదారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు వినియోగదారుల దినోత్సవానికి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హాజరై బిల్లులు, ఇతర విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీర్ కె. వెంకటేష్ గౌడ్ తెలిపారు.

నేటి నుంచి నామినేషన్ల పర్వం

- పాతబస్తీలోని రిటర్నింగ్ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- 13న స్క్రూటినీ, 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ

చార్మినార్: నామినేషన్ల పర్వం శుక్రవారం నుంచి ప్రారంభమవుతోంది. ఇందుకోసం పాతబస్తీలోని రిటర్నింగ్ కార్యాలయాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 3న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే నామినేషన్ల స్వీకరణ కార్యక్రమానికి ఎలాంటి అడ్డంకులు, ఇబ్బందులు లేకుండా ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నారు. దక్షిణ మండలం పోలీసులు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని సంబంధిత నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఈనెల 5న ఆదివారం సెలవు కావడంతో ఎలాంటి నామినేషన్లను స్వీకరించరు. పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలంటున్నారు. 13వ తేదీనా స్క్రూటినీ.. ఈనెల 15న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అనంతరం ఫైనల్ లిస్టు విడుదల చేసిన అనంతరం పార్టీల వారిగా ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు.

అభ్యర్థులు పాటించాల్సిన విషయాలు...

- నామినేషన్ వేసే అభ్యర్థులు పార్టీ జెండాలు, కళ్లద్దాలు లేకుండా సాధారణంగా దిగిన కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటో జత చేయాలి.
- తనపై ఉన్న కేసుల వివరాలతో కూడిన ప్రకటనలను మూడు బాషల్లోని దిన పత్రికల్లో మూడు రోజుల పాటు ఇవ్వాలి. అలాగే ఎల్రక్టానిక్ మీడియాలో కూడా..



అధికారులతో సమావేశమైన చార్మినార్ రిటర్నింగ్ అధికారి వెంకన్న

- నామినేషన్ వేసే అభ్యర్థులకు 100 అడుగుల వరకే వాహనాలకు అనుమతి. అక్కడి నుంచి కాలినడకన రావాల్సి ఉంటుంది.
- నామినేషన్ వేసే అభ్యర్థి సొంత నియోజకవర్గం కానట్లయితే.. ఓటు హక్కు కలిగి ఉన్న నియోజకవర్గానికి సంబంధించిన ఈఆర్‌ఓతో పత్రం రాయించుకురావాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ సంస్థలకు ఆస్తి పన్నులు, బ్యాంక్‌లలో రుణాలు లాంటివి (నో–డ్యూ) లేకుండా ఉండాలి.
- ఎన్నికల బరిలో నిలిచే ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకోవడానికి అనుమతి.
- జాతీయ బ్యాంక్‌లో కొత్తగా అభ్యర్థి పేరుతో అకౌంట్ తెరవాలి.

రిటర్నింగ్ కార్యాలయాలు ఇవే..

- పాతబస్తీలో చార్మినార్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా తదితర నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను వారి సమయానుకూలంగా దాఖలు చేయనున్నారు. ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ల ప్రక్రియ 10వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా ఆయా పార్టీలకు చెందిన నియోజకవర్గాల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ముహూర్తాలను ఖరారు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా నామినేషన్ పత్రాలు దాఖలు చేసే కార్యాలయాలు..

- మొగల్‌పురాలోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనంలోని మొదటి అంతస్తులో..
- యాకుత్‌పురా: చంపాపేట్‌లోని సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం.
- బహదూర్‌పురా: బహదూర్‌పురాలోని బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం.
- చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమాలోని బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయం.

జంగ్ తెలంగాణ 2023

ఫారం-26 సక్రమంగా లేకపోతే తిరస్కరిస్తాం..



ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమవుతున్న నామినేషన్ల దాఖలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. యాకుత్‌పురా నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను చంపాపేట్‌లోని సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం భవనంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దాఖలు చేయాలి. ఫారం-26లో పొందు పరిచిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. ఏ ఒక్క కాలం పూర్తి చేయకపోయినా.. స్క్రూటినీలో (తిరస్కరిస్తాం)రిజెక్ట్ చేస్తాం. కాదు/లేదు.. అని కాకుండా వివరాలతో కూడిన సమాచారాన్ని పొందుపరచాలి. అభ్యర్థులు నిబంధనలు పాటించాలి.

– వెంకటాచారి, యాకుత్‌పురా రిటర్నింగ్ అధికారి

మజ్లిస్‌కు ప్రజాదరణ మెండు: ఎమ్మెల్యే కౌసర్



కార్వాన్‌లో మజ్లిస్ పాదయాత్రలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజాదరణ మెండుగా ఉందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, లంగర్‌హౌస్ డివిజన్లలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నానల్‌నగర్ కాలనీలో ఆయన స్థానికులతో సమావేశమయ్యారు. ప్రజా సంక్షేమమే మజ్లిస్ పార్టీ ఎజెండా అని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీ ఎప్పుడు కూడా ఎన్నికల మేనిఫెస్టో అంటూ అసత్య ప్రకటనలు ఇవ్వదని ఆయన పేర్కొన్నారు. ప్రజల వెంట ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ పార్టీ ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన కోసం తాను విద్యా శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రతి పాఠశాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈసారి గతంలో కంటే మజ్లిస్ కార్వాన్ నియోజకవర్గంలో రికార్డు మెజార్టీతో గెలుస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ఆరూస్ ఫరాన్, బదరుద్దీన్, వజీఉజ్‌జమా తదితరులున్నారు.

మహ్మద్ గౌస్ ఎక్కడ..?



మహ్మద్ గౌస్

చార్మినార్: చార్మినార్ నియోజకవర్గంలో సీనియర్ మజ్లిస్ పార్టీ నాయకుడు మాజీ కార్పొరేటరైన మహ్మద్ గౌస్ గత శాసన సభ ఎన్నికల అనంతరం సైలెంట్‌గా ఉన్నారు. ఎన్నో నాటకీయ పరిణామాలతో మజ్లిస్ పార్టీని ఎదురించి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2018 శాసన సభ ఎన్నికల్లో చార్మినార్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అనంతరం తిరిగి మజ్లిస్ పార్టీలో చేరిన ఆయనకు 2019లో జరిగిన కార్పొరేటర్ ఎన్నికల్లో ఘాన్సీబజార్ డివిజన్ నుంచి పోటీ చేసే అవకాశం లభించింది. అయితే మహిళా రిజర్వు కావడంతో ఆయన భార్యకు టికెట్ లభించడంతో ఆమె కార్పొరేటర్‌గా విజయం సాధించింది. అప్పటి నుంచి మహ్మద్ గౌస్ సైలెంట్‌గా ఉండిపోయారు. ఈసారి జరిగే ఎన్నికల్లో తనకు చార్మినార్ నియోజకవర్గం నుంచి టికెట్ లభిస్తుందని ఆశిస్తున్నారు. 1969లో జన్మించిన ఆయన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టాపొందారు. 1983 నుంచి స్వర్గీయ సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీకి అండగా ఉంటూ మజ్లిస్ పార్టీ జెండాలు మోసిన మహ్మద్ గౌస్ 2002 బల్దియా ఎన్నికల్లో చార్మినార్ మున్సిపల్ డివిజన్ నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో శాలిబండ డివిజన్ నుంచి రెండోసారి విజయం సాధించిన ఆయన డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. మజ్లిస్ పార్టీ అధిష్టానంతో విభేదించిన ఆయన 2016 జనవరి 10న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం తిరిగి సొంత గూటికి చేరారు.

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం



మాట్లాడుతున్న గోవా బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సదానంద్ షెట్ తనవడే

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని గోవా బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సదానంద్ షెట్ తనవడే అన్నారు. గురువారం కార్వాన్ రాంసింగ్‌పురాలో జరిగిన బీజేపీ నాయకులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ ఇన్‌చార్జీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు వచ్చే శాసన సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క ఓటరుకు పోలింగ్ బూత్ వరకు తెచ్చి ఓటు వేయించాలని ఆయన అన్నారు. ప్రధాని మోదీ తన పదవీ కాలంలో సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై సమావేశాలు పెట్టి ప్రజలు, బస్తీ వాసులకు తెలియజేయాలన్నారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆయన ఆరోపించారు. కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్, గోల్కొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, నందకుమార్‌యాదవ్, జి.సునీల్‌యాదవ్, బిజ్వర్ సింగ్ తదితరులున్నారు.

మిత్రకృష్ణ గెలిచిన వెంటనే స్లాటర్‌హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన



మిత్రకృష్ణకు గొర్రెపిల్ల, గొంగడితో సన్మానిస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

జియాగూడ/గోల్కొండ: కార్వాన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ గెలిచిన వెంటనే స్లాటర్‌హౌస్‌ను మోడ్రన్ స్లాటర్‌హౌస్‌గా నిర్మించేందుకు శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం అన్నారు. గురువారం జియాగూడ ఎస్‌డీఏ ఫంక్షన్‌హాల్‌లో గొల్లకురుమ ఆత్మీయ సమ్మేళనం జియాగూడ కురుమ సంఘం అధ్యక్షుడు మంతటి నర్సింహ, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు అంజియాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే మిత్రకృష్ణను గెలిపిస్తే కార్వాన్ అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత అందుతాయన్నారు. అభ్యర్థి మిత్రకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు, 100 పడకలతో మెటర్నిటి ఆస్పత్రి, ఇతర అభివృద్ధి పనులు చేపడుతానని హామీ ఇచ్చారు. చివరగా గొంగడి, గొర్రెపిల్ల, కర్రలతో యెగ్గె మల్లేశం, కురుమ యాదవులు మిత్రకృష్ణను సన్మానించారు. అలాగే కార్వాన్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు తూమ్‌కుంట అరుణ్‌కుమార్, విద్యాసంస్థల అధ్యక్షుడు బి.గాలయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్, బాలపోశయ్య, కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌కుమార్, రమేష్ యాదవ్, సోంపు యాదవ్, మిత్ర అభిషేక్, నరహరిచారి, పట్లూరి రఘు, చిన్న శ్రీశైలంయాదవ్, ఆగిరి నర్సింహ, రాము, శ్రీనివాస్ గుప్తా, జడల మోహన్ సి.బాబు, కేశవ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



ఆర్ఓ విక్టర్

అబిడ్స్: ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా జరిగేవిధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని గోషామహల్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..ఈనెల 3న శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు. సెలవు దినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదన్నారు. ప్రతిరోజూ 3 గంటల లోపు కార్యాలయానికి వచ్చే అభ్యర్థుల నామినేషన్ మాత్రమే స్వీకరిస్తామన్నారు. 13న నామినేషన్ల స్క్రూటినీ, 15న నామినేషన్ల విత్‌డ్రాల్ ఉంటుందన్నారు. 15వ తేదీ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన..

నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెంచేందుకు ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆర్ఓ. విక్టర్ వివరించారు. 235 పోలింగ్‌స్టేషన్ల పరిధుల్లో బీఎల్ఓలు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఇంటిముందు ఓటర్ల వివరాలు కూడా గోడలకు అంటిస్తామన్నారు. ఓటు విలువ ఎంతో విలువైందని, ఓటర్లలో చైతన్యం తెచ్చే విధంగా వారికి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ఈనెల 30న నియోజకవర్గంలోని 235 పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ శాతం పెంచే విధంగా, పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగే విధంగా అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రతిరోజూ ప్రత్యేక తనిఖీలు..

నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారని ఆర్ఓ విక్టర్ వివరించారు. మూడు షిఫ్టుల్లో 9 బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రచారాన్ని, అభ్యర్థుల పాదయాత్రలు, రాజకీయ పార్టీల మొత్తం వివరాలను వీడియోద్వారా చిత్రీకరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినవారి పట్ల కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి



అబిడ్స్: పరేడ్‌గ్రౌండ్‌లో నవంబర్ 11న నిర్వహించే చలో హైదరాబాద్ బహిరంగ సభను జయప్రదం చేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య మాదిగ పిలుపునిచ్చారు. నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ పూజలోల్ల రవి మాదిగ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. అందరూ పెద్ద ఎత్తున పరేడ్‌గ్రౌండ్ బహిరంగ సభలో పాల్గొని మన సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సత్యనారాయణ మాదిగ, రేణుకాదేవి, అంబేద్కర్, దుర్గా మాదిగ, సూర్యకుమార్, రామ్‌దాస్, మధు, అశోక్, సంజయ్ మాదిగ, దీపక్ మాదిగ, జగదీష్ మాదిగ, ఎర్రరాజు మాదిగ, పరిశరామ్ మాదిగ, దర్శన్ మాదిగ, అర్జున్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీఆర్‌ఎస్‌దే విజయం



ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌దే విజయమని సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో విజయం సాధిస్తామన్నారు. తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా నియోజకవర్గం నలుమూలలా బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. 2016 ఎన్నికల్లో జాంబాగ్ కార్పొరేటర్ కేవలం 5 ఓట్ల తేడాతో ఓటమి చెందానన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నాంపల్లి టికెట్ కేటాయించి రెండు నెలల పాటు తాను ప్రచారం చేసిన తర్వాత వేరే వారికి టికెట్ ఇవ్వడంతో పార్టీ అధిష్టానం అనుసారం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలంతా అతనిపై వ్యతిరేకంగా ఉన్నారని, తనకు టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



దూద్‌బౌలీ: ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్ కోరారు. నియోజకవర్గం పరిధిలోని కొన్ని బస్తీల్లో బీఎల్ఓ, సూపర్‌వైజర్స్‌తో కలిసి ఓటు హక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రైడ్ టు బీ ది ఓటర్ అనే కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కును నిర్లక్ష్యం చేయరాదన్నారు.

ఉచిత వైద్య శిబిరం



విజయమేరిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం

అబిడ్స్: విజయమేరి ఆస్పత్రిలో నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని విజయమేరి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల పేర్కొన్నారు. చింతలబస్తీలోని ఆస్పత్రి ఆవరణలో ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. తరచు పేద బడుగు వర్గాల ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థోపెడిక్‌లో బీఎండీ స్క్రీనింగ్‌తో పాటు ఇతర పలు రకాల సేవలందిస్తున్నామన్నారు. సమాజ సేవ చేసేందుకు తమ విజయమేరి ఆస్పత్రి ముందుంటుందని ఆమె అన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయం



కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న యాకుత్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రవిరాజ్

గౌలిపురా: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్ఎ పార్టీని గద్దె దింపి... కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని యాకుత్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.రవిరాజ్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా యాకుత్‌పురా నియోజకవర్గం అంబికానగర్‌లోని గాలి పోచమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈసారి తనకు అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తానన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ సెక్రటరీలు అల్లం భాస్కర్, కోట్ల శ్రీనివాస్, మామాడి కృష్ణ కుమార్, రాజు యాదవ్, డల్లు శివ, మామిడాల శ్రీనివాస్, అల్లం రాకేశ్, డీసీఎం శ్రీనివాస్, కోట్ల లడ్డా పటేల్, వెంకటమ్మ పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ పీఎస్ పరిధిలో కార్డన్ సెర్చ్

సంతోష్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని మోయిన్ బాగ్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజు, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్ర, ఎస్సైలతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్తీలో మోహరించి తనిఖీలు నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికలను పురస్కరించుకొని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెర్చ్‌లో 81 ద్విచక్ర వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేయడం జరిగిందన్నారు. 45 మందిపై ఈ–పెట్టీ కేసులను సైతం బుక్ చేయడం జరిగిందన్నారు.

రౌడీషీటర్‌కు 21 రోజులు జైలు



నాంపల్లి: న్యూసెన్స్ కేసులో న్యాయస్థానం ఓ రౌడీషీటర్‌కు 21 రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధించింది. గురువారం రెండవ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డీవీ సుబ్రహ్మణ్యేశ్వర రావు తీర్పును వెల్లడించారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాన్‌పుర ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ కుమారుడు షేక్ అలీ అలియాస్ అలీమ్ (32) రౌడీషీటర్. న్యూసెన్స్ కేసులో అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. కాగా న్యాయస్థానం నిందితుడికి 21 రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించింది.

'డబుల్' ఇళ్ల నిర్మాణం కేసీఆర్‌కే సాధ్యం



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్

గోల్కొండ: తెలంగాణలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం ఒక్క కేసీఆర్‌కే సాధ్యమని గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బంగారి ప్రకాష్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను పార్టీ మారుతున్నానన్న వార్తలు వస్తున్నాయని అయితే ఇది కేవలం పుకార్లు మాత్రమేనని ఆయన అన్నారు. తాను పార్టీ మార్చే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. రాష్ట్రంలోని పేద, బడుగు ప్రజలతో పాటు మైనార్టీలు బీఆర్‌ఎస్ పక్షానే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. భారీ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శివరాత్రి రాములు, రాజు, యాదగిరి తదితరులున్నారు.

ఢిల్లీకి బయలుదేరిన టీఎన్జీఓ కేంద్ర సంఘం నేతలు



నాంపల్లి: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) పిలుపు మేరకు నవంబరు 3న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరుపతలపెట్టిన చలో ర్యాలీలో పాల్గొనడానికి గురువారం టీఎన్జీఓ రాష్ట్ర సంఘం పక్షాన హైదరాబాద్ నగరం నుంచి 50 మంది టీఎన్జీఓ ప్రతినిధులు ఢిల్లీకి బయలుదేరారు. టీఎన్జీఓ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ నేతృత్వంలో బయలుదేరిన ప్రతినిధి బృందం నూతన పెన్షన్ విధానం రద్దు, ఆదాయ పన్ను పరిమితి పెంపు, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ విధానం రద్దు తదితర డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న ర్యాలీలో పాల్గొంటుంది. ఢిల్లీకి బయలుదేరిన టీఎన్జీఓ కేంద్ర సంఘం నేతల్లో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామినేని శ్రీనివాసరావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మాతృభాష మాతృమూర్తితో సమానం



అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: మాతృభాష మాతృమూర్తితో సమానమని సినీగేయ రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అన్నారు. గురువారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మన సంస్కృతి ఆధ్వర్యంలో తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షల్లో విజేతలుగా నిలిచిన వారికి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ హాజరై విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రాశ్చాత పోకడాలతో మాతృభాషపై మక్కువ తగ్గుతుందన్నారు. డాక్టర్ వీవీ.రాజ్‌గోపాల్, పాలిశెట్టి రామ్మోహన్, డాక్టర్ షేక్ మస్తాన్, అన్నమయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కేవీ2లో బ్యాడ్మింటన్ పోటీలు



సాక్షి, సిటీబ్యూరో: 52వ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ జాతీయ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా గురువారం గోల్కొండ కేవీ2లో అండర్ 14, అండర్ 17, అండర్ 19 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సుబేదార్ మంజీత్ సింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అజాన్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్ అజామ్, అజాన్ గ్రూప్ కరస్పాండెంట్ డాక్టర్ నయ్యర్ ఫరోజిన్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. మొత్తం 297 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గోషామహల్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తాం



బీఆర్‌ఎస్‌లో చేరిన జితేందర్ సింగ్‌ను సత్కరిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతి, అభివృద్ధితో బీఆర్‌ఎస్ వైపు అన్ని పార్టీల వారు మొగ్గు చూపుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దివంగత కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శివలాల్ తనయుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జితేందర్ సింగ్ బీఆర్‌ఎస్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం నందకిశోర్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. బీజేపీని ప్రజలు నమ్మడం లేదన్నారు. 10 ఏళ్లుగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలంతా బీఆర్‌ఎస్‌వైపే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్, పప్పుమాత్రే, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.